14న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

6

స్వల్పంగా పెరిగిన పత్తి ధర



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత పది రోజులుగా పతనమైన పత్తి ధరల్లో మళ్లీ కదలిక వచ్చింది. శుక్రవారం పత్తి ధర క్వింటాకు రూ.200 పైగా పెరిగింది. స్వల్పంగానే ధర పెరిగినా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది గింజల ధరలు కొద్దిగా పెరగడంతో స్థానిక మార్కెట్ యార్డులో పత్తి ధర పెరిగిందని వ్యాపారులు తెలిపారు. శుక్రవారం 4,340 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4480, గరిష్ఠ ధర రూ.7229, మధ్యస్థ ధర రూ. 7089 పలికాయి.

హంద్రీ నీవా ఎస్ఈగా సురేష్‌బాబు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కర్నూలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు (హెచ్ఎన్ఎస్ఎస్) కర్నూలు సర్కిల్-1 ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా ఎస్ఆర్‌బీసీ డివిజన్-3 అవుకు సర్కిల్-2 ఈఈ ఎ.వెంకట సురేష్‌బాబును నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్ఈగా పని చేస్తున్న రాంగోపాల్ బదిలీపై వెళ్లాక ఆయన స్థానంలో సురేష్‌బాబు బాధ్యతలు తీసుకుంటారు. సురేష్‌బాబు 1987లో జలవనరుల శాఖలో ఏఈఈగా విధుల్లో చేరారు. 2006లో డీఈఈగా, 2016లో ఈఈగా పదోన్నతి పొందారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్ఆర్‌బీసీ, మైనర్ ఇరిగేషన్‌లో పని చేశారు. అనంతపురం జిల్లా తుంగభద్ర ఎగువ కాలువలో కూడా పని చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం ఎస్ఆర్‌బీసీ అవుకు సర్కిల్ పని చేస్తున్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ కర్నూలు సర్కిల్-1 ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన వచ్చే ఏడాది ఏప్రిల్‌లో పదవి విరమణ చేయనున్నారు.

ఆయుధాలపై అవగాహన పెంచుకోండి

ఫైరింగ్ ప్రాక్టీసులో ఎస్పీ బిందుమాధవ్



ఫైరింగ్ సాధనలో ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు, సిబ్బంది వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక దిన్నెదేవరపాడు గ్రామం జగన్నాథ గట్టు సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి ఐదు రోజుల ఫైరింగ్ ప్రాక్టీసు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకే-47, ఎస్ఎల్ఆర్, పిస్టల్ వినియోగంలో సాధన చేశారు. అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఫైరింగ్ గురించి దిశా నిర్దేశం చేశారు. ఆయుధాల వినియోగంలో మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ పాల్గొన్నారు.

ఇక స్మార్ట్ మీటర్లు

- తొలిగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు
- విద్యుత్ చౌర్యానికి చెక్
- ఎన్నో సౌకర్యాలు ఉంటాయంటున్న అధికారులు

ఆదోని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వచ్చేశాయి. తొలివిడతగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లు తొలగించి కొత్తగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి దాకా విద్యుత్ బిల్లుల రీడింగ్ తీసుకోవడానికి ఏజెన్సీ సిబ్బంది ఇంటికి వచ్చి ఐఆర్ మీటర్ల వద్ద తమ సెల్‌ఫోన్ పెట్టగానే రీడింగ్ నమోదై ప్రింటెడ్ బిల్లు వచ్చేది. వారు వచ్చిన సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకపోతే బిల్లు తీసుకోవడం కష్టంగా మారుతోంది. దీని వల్ల విద్యుత్ బిల్లుల బకాయిలు పెరిగిపోతున్నాయి. విద్యుత్ శాఖపై అప్పుల భారం పెరిగిపోతోంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి స్మార్ట్ మీటర్ ఎంతో ఉపయోగపడనుంది. ఇప్పటికే జిల్లాలో ఐదు వేల మీటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.



స్మార్ట్ మీటర్‌ను బిగిస్తున్న సిబ్బంది



బకాయిల భారం తగ్గనుంది

తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు ఐఆర్ మీటర్‌లు తొలగించి స్మార్ట్ మీటర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. భవిష్యత్తులో డొమెస్టిక్ సర్వీసులకు కూడా స్మార్ట్ మీటరులు ఏర్పాటు చేస్తాం. విద్యుత్ శాఖ బకాయిల భారం తగ్గి మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేసే అవకాశం స్మార్ట్ మీటర్లతో వస్తుంది. సౌర విద్యుత్తును కూడా అనుసంధానం చేయవచ్చు.

- హరి, డీఈ, ఆదోని

విద్యుత్ చౌర్యానికి చెక్

స్మార్ట్ మీటర్లతో విద్యుత్ చౌర్యానికి పూర్తిగా చెక్ పెట్టవచ్చని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. సిబ్బంది ప్రతి నెలా వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం వుండదు. ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ కేంద్రానికి మీటర్ రీడింగ్ చేరుతుంది. ఎన్ని యూనిట్లు వాడారు..? ఎంత బిల్లు చెల్లించాలి..? అనే వివరాలు వినియోగదారుల మొబైల్ ఫోన్‌కు మెసెజ్ ద్వారా తెలియపరుస్తారు. గడువులోగా బిల్లు చెల్లించకపోతే మానిటరింగ్ కేంద్రం నుంచే స్మార్ట్ మీటర్ ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపివేసి, లైన్‌మెన్ ఇళ్లకు వచ్చి ఫీజులు తీసుకెళ్లాల్సిన పని వుండదు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే స్మార్ట్ మీటర్ వెంటనే మానిటరింగ్ కేంద్రానికి సమాచారం పంపుతుంది. దీంతో విద్యుత్ చౌర్యాన్ని వెంటనే అరికట్టడమే కాకుండా సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుంటారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎక్కడ, ఎందుకు సరఫరా నిలిచిపోయిందో స్మార్ట్‌మీటర్ ద్వారా వెంటనే మానిటరింగ్ కేంద్రానికి సంకేతాలు వస్తాయి సిబ్బంది నేరుగా అక్కడకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తారు.



స్మార్ట్ మీటర్ ఉపయోగాలివి

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు బిల్లు ఎంత అయిందీ తెలుసుకోవచ్చు. భవిష్యత్తులో ఈ మీటర్లను ప్రీపెయిడ్‌గా ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల విద్యుత్ సరఫరా ఎంత కావాలో అంతవరకు మాత్రమే ముందుగా బిల్లు చెల్లించుకునే వెసులుబాటు వినియోగదారుడికి ఉంటుంది. దీనివల్ల వినియోదారుడు విద్యుత్ వృథా కాకుండా వినియోగంపై స్వీయ నియంత్రణ చేసుకునే అవకాశం ఉంది. ఎప్పటికప్పుడు విద్యుత్ వినియోగానికి సంబంధించి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చు.

నదుల అనుసంధానానికి స్వాగతం: బొజ్జా



నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను కృష్ణా నదికి మళ్లించి నదుల అనుసంధానం ద్వారా రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరందించాలనే ముఖ్యమంత్రి సంకల్పాన్ని స్వాగతిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల సమితి కార్యాలయంలో బొజ్జా మాట్లాడుతూ... 518 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలు సముద్రంలో కలుస్తున్నాయని అన్నారు. రాయలసీమలో సాగు నీటి నిర్మాణాలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని, దాన్ని పరిష్కరించాలని బొజ్జా ఒక లేఖలో ముఖ్యమంత్రిని కోరారు. నదుల అనుసంధానం మీద ప్రభుత్వం రాయలసీమలోని ప్రజాసంఘాల అభిప్రాయం తీసుకోవాలని కోరారు. కృష్ణా నదిలో నీటి లభ్యత వున్నప్పటికీ రాష్ట్ర విభజన చట్టంలో అనుమతించిన తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలుగొండ ప్రాజెక్టుల మౌలిక నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వలన, శ్రీశైలం రిజర్వాయర్ విధి విధానాలను సక్రమంగా అమలుపరచకపోవడం వలన ఆయకట్టుకు నీరందడం లేదన్నారు. ఈ పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. అలాగే నాగార్జున సాగర్ దిగువ నుండి ప్రకాశం బ్యారేజి వరకు కృష్ణా డెల్టాకు చట్టబద్ధంగా లభించే 101 టిఎంసిల నీటిని వినియోగించుకోకపోవడం వలన ఈ జలాలు సముద్రం పాలవుతున్నాయన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుండి నీటిని తరలించడం వలన శ్రీశైలం రిజర్వాయర్‌పై ఒత్తిడి పెరగడంతో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల ఆయకట్టుకు సాగునీరు లభించడం లేదని అన్నారు. దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టైల్‌పాండ్ ద్వారా గోదావరి జలాలను నాగార్జున సాగర్‌లో నిల్వ ఉంచి సాగర్ ఆయకట్టుకు నీరు అందించాలని అన్నారు. తద్వారా శ్రీశైలం రిజర్వాయర్ నీటిని పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు వినియోగించుకునేలా ప్రణాళిక చేపట్టాలని కోరారు.

తెలుగు విద్యార్థులకు వరం క్లస్టర్ వర్సిటీ

వీసీ సాయిగోపాల్ 6

బైక్ షోరూం ఉద్యోగి చేతివాటం

రూ.2.36 కోట్ల పరికరాలు పక్కదారి 7

పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజా పద్దుల కమిటీ సభ్యుడిగా బీవీ ఎన్నిక



కర్నూలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) సభ్యుడిగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. శాసనసభ చరిత్రలో ఈ కమిటీకి తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, బడ్జెట్ కేటాయింపులు మేరకు వివిధ శాఖలు చేసే నిధుల వ్యయాలపై ఈ కమిటీ సమీక్షిస్తుంది. కమిటీలో శాసనసభ (ఎమ్మెల్యేలు) నుంచి 9 మంది, శాసన మండలి (ఎమ్మెల్సీలు) నుంచి ముగ్గురు చొప్పున 12 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఒకరిని పీఏసీ చైర్మన్‌గా ఎంపిక చేస్తారు. సాధారణంగా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారికే పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. అయితే వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాకుండా కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలిచారు. పీఏసీ కమిటీ సభ్యుడిగా ఎంపిక అవ్వాలంటే కనీసం 18 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి. అందుకే వైసీపీకి కనీసం పీఏసీ పదవి కూడా దక్కకుండా పోయింది. రాష్ట్ర విభజన తరువాత 2014-19 వరకు ఆనాటి ప్రతిపక్ష పార్టీ వైసీపీ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పీఏసీ చైర్మన్‌గా ఉన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆయనే ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2019-24 మధ్య నాటి ప్రతిపక్ష పార్టీ టీడీపీ నంచి అనంతపురం జిల్లా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పీఏసీ చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో తాజాగా పీఏసీ సభ్యులుగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి సహా 9 మంది నామినేషన్ వేశారు. వైసీపీ నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా నామినేషన్ వేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. పీఏసీ సభ్యుడిగా ఎంపికైన బీవీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సీఎం ఎంతో నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు ఇచ్చారన్నారు. వివిధ శాఖల్లో నిధులు వ్యయాలపై తనిఖీలు చేస్తూ ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు.

రూ.61.06 కోట్ల సెస్సు వసూలు

- కర్నూలు పరిధిలో ఇప్పటివరకు 17వేల క్వింటాళ్ల పత్తికొనుగోలు
- కడప రీజనల్ జేడీఎం రామాంజనేయులు

ఎమ్మిగనూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప రీజియన్ పరిధిలోని 8 జిల్లాల్లో అక్టోబరు నెలాఖరు వరకు రూ.61.06 కోట్ల మేర మార్కెట్ సెస్సు వసూలు చేసినట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ రామాంజనేయులు వెల్లడించారు. అదేవిధంగా కర్నూలు జిల్లాలోని పది సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 17,600 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు తెలిపారు. శుక్రవారం జేడీఎం ఎమ్మిగనూరు పట్టణ శివారులో పత్తి మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కమిటీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రీజియన్ పరిధిలో సెస్సు వసూలు లక్ష్యం రూ.133.16 కోట్లుగా పెట్టుకున్నామన్నారు. కర్నూలు జిల్లాలో సెస్సు వసూలు బాగుందన్నారు. ఇప్పటివరకు 47శాతం వసూలైందని తెలిపారు. జిల్లాలో ఎమ్మిగనూరులో మూడు, మంత్రాలయంలో రెండు, పెంచికలపాడు దగ్గర ఒకటి, ఆదోనిలో నాలుగు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఎక్కడైనా రైతులు పత్తి మద్దతు ధరకు విక్రయించవచ్చన్నారు. రైతులు ముందుగా రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని కేంద్రాలకు పత్తి తీసుకెళ్లాలని అన్నారు. పత్తి రైతులకు అండగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అందుబాటులోకి తెచ్చాయన్నారు. రైతులు పండించిన పండించిన పత్తి పంటలో 60శాతం కొంటున్నామని అన్నారు. డిసెంబరు 15 నుంచి పూర్తి స్థాయిలో కొంటామని తెలిపారు. పత్తి సరిగా లేదని సీసీఐ కేంద్రాల నుంచి వెనక్కి పంపుతున్నారని, తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నట్లు జేడీఏ దృష్టికి తీసుకెళ్లగా.. పత్తి పూర్తిగా రంగుమారినా, తేమశాతం ఎక్కువగా ఉన్నా అధికారులు ఏమీ చేయలేరని అన్నారు. ఆయన వెంట ఎమ్మిగనూరు మార్కెట్ కార్యదర్శి పద్మావతి, సిబ్బంది ఉన్నారు.



జిన్నింగ్ పరిశ్రమలో పత్తి కొనుగోలును పరిశీలిస్తున్న జేడీఎం

దారి లేక.. దాటలేక..!





కోడుమూరు మండలంలోని గోరంట్ల వద్ద హంద్రీనది వద్ద ప్రజల కష్టాలు అన్నీ ఇన్ని కావు. ఇక్కడ హంద్రీ నది దాటాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. వర్షాకాలంలో వరద వస్తే ఆ ఛాయలకు కూడా వెళ్లే పరిస్థితి లేదు. ఈ మార్గంలో గోరంట్ల, ఎర్రగుడి, కొత్తపల్లి, మన్నెగుంట, ఎర్రబాడు, మల్లాపురం, రామక్రిష్ణాపురం, క్రిష్ణగిరి, ఎరుకలచెరువు, క్రిష్ణగిరి, బాపలదొడ్డి వంటి పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఆటోలు, బైక్‌లు హంద్రీ నది దాటుతున్నాయి. అయితే ప్రయాణమంతా ఒక ఎత్తు కాగా హంద్రీ దాటడం సవాల్‌గా మారుతోంది. -కోడుమూరు రూరల్

తెలుగు విద్యార్థులకు వరం క్లస్టర్ వర్సిటీ

● నేడు యువతరంగ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ రాక ● వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు విద్యార్థులకు క్లస్టర్ యూనివర్సిటీ వరంలాంటిదని ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలోని ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ యువతరంగ్ 2024 ఇంటర్ కాలేజీ క్రీడా పోటీలు నిర్వహించామని, గెలిచిన వారికి శనివారం వర్సిటీ క్రీడా మైదానంలో ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో సుమన్, ఎస్పీ బిందు మాధవ్, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, టీటీడీ బోర్డు మెంబరు మల్లెల రాజశేఖర్, మాజీ ఏబీవీపీ జాతీయ కార్యదర్శి పసతల సురేష్ హాజరవుతారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి

లక్ష్యం దిశగా కృషి చేయండి

ఉన్నతమైన లక్ష్య సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఆర్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం రాయసీమ యూనివర్సిటీలోని ఆడిటోరియంలో పీజీ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రాంతాలు, వివిధ నేపథ్యాల నుంచి వర్సిటీలో పీజీ కోర్సులు చదవడానికి వచ్చిన విద్యార్థులు తమ తల్లితండ్రుల ఆశలు ఫలించేలా లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని సూచించారు. క్యాంపస్‌లో ర్యాగింగ్ ఏ రూపంలోనూ ఉండకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, డీన్స్ ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ఆట్యా పాట్యా పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్ డోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి ఆట్యా పాట్యా ఎంపిక పోటీలు ముగిసినట్లు జిల్లా సంఘం కార్యదర్శి బాలపవన్ తెలిపారు. బాలికల విభాగంలో ఓర్వకల్లు కేజీబీవీ పాఠశాల మొదటి స్థానంలో, రెండో స్థానంలో మంత్రాలయం కేజీబీవీ జట్లు నిలిచాయి. మూడో స్థానంలో పంచలింగాల కేజీబీవీ జట్టు నిలిచింది. బాలుర విభాగంలో ఓర్వకల్లు ఏపీ మోడల్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో అహోబిలం జడ్పీహెచ్ఎస్, మూడో స్థానంలో ఆళ్లగడ్డ జడ్పీహెచ్ నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కొమ్ము సుందర్‌రాజు హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు, ట్రోఫీని అందజేశారు.

14న జాతీయ లోక్ అదాలత్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 14వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు అధికారులందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థక కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి పాల్గొన్నారు.

న్యాయ శాఖ కార్యదర్శిగా ప్రతిభాదేవి

కర్నూలు లీగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని న్యాయ శాఖ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై కర్నూలు ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి జి.ప్రతిభాదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిం ది. ఇప్పటి వరకు ఈ పదవిని నిర్వహిస్తున్న వి.సునీత స్థానంలో ఈమెను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తన ఉత్తర్వులో పేర్కొంది. ఈమె ఈ పదవిలో రెండు సంవత్సరాలు కొనసాగు తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటరు నమోదు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా శని, ఆదివారం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తొలగింపు కోసం సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలకు అర్జీ ఇవ్వవచ్చునన్నారు.

నంద్యాల కల్చరల్: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 23 24 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తామని కలెక్టర్, ఎన్నికల అధికారి రాజకుమారి తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు ముసాయిదా ఓటరు జాబితా-2025 తో అందుబాటులో ఉంచారని చెప్పారు. 01.01.2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో చిరునామాలో మార్పు చేర్పుల కోసం సంబంధిత పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓకు అర్జీ ఇవ్వాలన్నారు.

కొలిమిగుండ్లతో విడదీయరాని బంధం

● భగవాన్ సత్యసాయిబాబా మాతృమూర్తి స్వగ్రామం ● నేడు సత్యసాయిబాబా 99వ జయంతి



సాయిబాబాతో తల్లి ఈశ్వరమ్మ (ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ విదేశాల్లో ఆధ్యాత్మిక చక్రవర్తిగా పేరుగాంచిన భగవాన్ సత్యసాయిబాబాకు కొలిమిగుండ్ల మండలంతో విడదీయరానిబంధం ఉంది. బాబా మాతృమూర్తి ఈశ్వరాంబ పుట్టినిల్లు కొలిమిగుండ్ల. నేడు సత్యసాయి 99వ జయంతి సందర్భంగా మండల ప్రజలు బాబా ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కొలిమిగుండ్లకు చెందిన సుబ్బరాజు, సుబ్బాయమ్మ దంపతుల కుమార్తె ఈశ్వరమ్మ. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన అసలు పేరు నామగిరాయమ్మ. అయితే వివాహ అనంతరం మామ కొండమరాజు (సాయిబాబా తాత) ఆమెకు ఈశ్వరమ్మగా నామకరణం చేశారు. ఈశ్వరమ్మ కుటుంబం ఆమె వివాహానికి ముందే తమ సమీప బంధువులు కొండమరాజు పిలుపు మేరకు పుట్టపర్తికి తరలివెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం కొండమరాజు పెద్ద కుమారుడు పెద్ద వెంకప్పరాజుతో ఈశ్వరమ్మ వివాహం జరిగింది. ఈ దంపతులకు 1926 నవంబరు 23న కలిగిన సంతానమే భగవాన్ సత్యసాయిబాబా. తల్లిదండ్రులు పెట్టిన పేరు సత్యనారాయణరాజు. అయితే తన 14వ ఏటనే సత్యనారాయణరాజు అనంతపురం జిల్లాలో సత్యసాయిబాబాగా మారారు. . సత్యసాయిబాబా చిన్నతనంలో ఈశ్వరమ్మతో కలిసి కొలిమిగుండ్ల శివాలయాన్ని పలుమార్లు సందర్శించారు. రాష్ట్రం, దేశం ఇలా ప్రపంచ నలుమూలలా తన ఆధ్యాత్మిక ప్రసంగాలతో భక్తులను ఆకర్షించారు. సుమారు 120 దేశాల్లో సత్యసాయి భక్తులు ఉన్నారంటే ఆయన ఆధ్యాత్మిక శక్తి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు మానవ సేవే మాధవ సేవ అని తలంచిన సత్యసాయిబాబా తన ట్రస్టు ద్వారా దేశ విదేశాల్లో తన సేవలను అందించారు. ఇదిలావుండగా సత్యసాయిబాబా చివరి సమయంలో కొలిమిగుండ్లలో తన తల్లి ఈశ్వరమ్మకు గుడి నిర్మించాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు కొలిమిగుండ్లకు చేరుకొని పెద్దలతో చర్చించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో 2007-2009 మధ్య కాలంలో పలుమార్లు గ్రామంలో నగర సంకీర్తన, మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికైనా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ జన్మించిన కొలిమిగుండ్లను గుర్తించి, బాబా సంకల్పాన్ని పూర్తి చేయాలని మండల వ్యాప్తంగా ప్రజలు కోరుతున్నారు.



సత్యసాయిబాబా తల్లి ఈశ్వరమ్మ(ఫైల్)

వ్యాపారుల అంచనా తలకిందులు

క్వింటా రూ.5 వేలు దాటిన ఉల్లి



మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉల్లి ధర నవంబరు 2వ వారం నుంచి తగ్గిపోతుందని వ్యాపారులు అంచనా వేశారు. మహారాష్ట్ర నుంచి ఏపీ మార్కెట్‌కు భారీగా విక్రయానికి ఉల్లి తరలివస్తుందని, దీంతో కర్నూలులో ఉల్లికి డిమాండ్ తగ్గుతుందని వారు అంచనా వేశారు. అయితే.. వారి అంచనాలను తలకిందుల చేస్తూ కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి ధర పెరిగిపోతోంది. శుక్రవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం ఉల్లి ధర గరిష్ఠంగా రూ.5,099కు చేరింది. మధ్యస్థ ధర రూ.3,388, కనిష్ఠ ధర రూ.495 పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలి పారు. అదేవిధంగా ఎండుమిరపకాయలు గరిష్ఠ ధర రూ.15,613, మధ్యస్థ ధర రూ.10,109, కనిష్ఠ ధర రూ.713కు చేరింది.

26న 'కార్మిక' ఆందోళన : సీఐటీయూ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వినాశకర విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక, రైతులు సంఘటితమై 26న చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ హమాలీ కార్మికులు, మార్కెట్ యార్డు లారీ హమీలీల కార్మికుల సర్వసభ్య సమావేశం నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయం,కార్పొరేటీకరణ, జీవనోపాధులపై బీజేపీ ప్రభుత్వాలు సాగిస్తున్న దాడులు తిప్పికొట్టాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జడ్పీ సమావేశం వాయిదా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జరగాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు జడ్పీ సీఈవో జి నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానుండటంతో సమావేశం వాయిదా వేశామన్నారు.

ఆక్సిజన్ పైపులైన్ పనులు వేగవంతం చేయండి



డైట్‌లో డాక్టర్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆక్సిజన్ పైపులైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పనులు వెంటనే ప్రారంభించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పలు విభాగాల్లో రౌండ్స్ నిర్వహించారు. డైట్ విభాగంలో డాక్టర్స్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. వైద్యులందరినీ తనిఖీ చేసి వారి సంతకాలు తీసుకోవాలని డైటీషియన్ రామాంజనేయులును ఆదేశించారు. వేసవి కాలంలో ఔషధాల నిలుపుదల కోసం రూఫింగ్‌తో ఫార్మసీ డిస్పెన్సరీలో మరమ్మతులను చేయనున్నట్లు తెలిపారు. ఈ రౌండ్స్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.డి. శ్రీరాములు, డా. సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో డా. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని పాల్గొన్నారు.

హైకోర్టులో బెంచ్ ప్రకటనపై ఆర్‌యూలో సంబరాలు

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై రాయలసీమవర్సిటీలో శుక్రవారం ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఉద్యోగులు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గౌరవ అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి, మీనాక్షిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, సలహాదారుడు రంగనాథ్ గౌడ మాట్లాడుతూ కర్నూల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఇక్కడి ప్రజల ఆకాంక్ష అన్నారు. దశాబ్దకాలంగా రాయలసీమ ప్రజలు ఎదురు చూస్తుండగా, ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటం శుభపరిణామని కొనియాడారు.



ఆర్‌యూలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు


అమ్ముకోవాలన్నా అగచాట్లే..!

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కష్టాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటను అమ్ముకునేందుకు వస్తే రైతులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గూడురు మండలంలోని పెంచికలపాడు వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రానికి శుక్రవారం పత్తి దిగుబడులు పోటెత్తాయి. కొనుగోలు కేంద్రం పరిసరాలతో పాటు కర్నూలు రహదారిపై భారీగా వాహనాలు నిలిచి ఉన్నాయి. టోకన్ నంబర్ ప్రకారం వాహనాలను అనుమతిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో పత్తి ధర ఆశాజనకంగా లేకపోవడంతో సీసీఐకు విక్రయించుకోవాడానికి రైతులు క్యూ కట్టారు. చాలామంది రైతులు రెండురోజుల నుంచి సీసీఐ కేంద్రం వద్ద పడిగాపులు పడుతున్నారు. అన్‌లోడింగ్ ప్రక్రియ నిదానంగా సాగుతుండడమే కారణమని వాపోతున్నారు. దీంతో వాహనం బాడుగతో పాటు అదనంగా ఉన్న రోజుకు దూరంబట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు చెల్లించుకుంటున్నామని రైతులు తెలిపారు. రాత్రిపూట చలికి తోడు దోమల బెడద తప్పడం లేదని అన్నారు. పత్తి తనిఖీ, అన్‌లోడింగ్ పూర్తయ్యేవరకు నిద్రాహారాలు లేవని ఆవేదన చెందారు. అన్‌లోడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీసీఐ కేంద్రం వద్ద వాహనాలు



గూడురు మండలం పెంచికలపాడు వద్ద సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తి వాహనాలు



పార్టీ కోసం పని చేసిన వారందరికీ పదవులు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



డైరెక్టర్లు, చైర్మన్లను సన్మానిస్తున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ కోసం పని చేసిన వారందరి కోసం ప్రభుత్వ పదవులు ఇప్పించేందుకు కృషి చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన డైరెక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో కుడా చైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ చైర్మన్లుగా కపత్రాళ్ల బోజమ్మ, దేవేంద్రప్పలతో పాటు పలువురు డైరెక్టర్లను అభినందించారు. అధినేత చంద్రబాబు పార్టీ కోసం పని చేసిన నాయకులను, కార్యకర్తలను గుర్తు పెట్టుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్, పి.అమర్నాథరెడ్డి, మీనాక్షినాయుడు, డి. సుందరరాజు, సోమిశెట్టి నవీన్, పేరపోగు రాజు, జే. తిరుపాల్ బాబు, షేక్షవలి పాల్గొన్నారు.

పాణ్యం అభివృద్ధి కోసం కృషి

- అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే గౌరు చరిత



కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గ అభివృద్ధే అజెండాగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో గళం వినిపించారు. ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా ఏర్పాటు చేస్తానన్న హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. దేశంలో 12 మ్యాన్యుఫ్యాక్చర్ క్లస్టర్లు మంజూరు కాగా రాష్ట్రానికి మూడు వచ్చాయని, అందులో ఓర్వకల్లు ఒకటన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.2800 కోట్లు మంజూరు చేయించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. గోరుకల్లు రిజర్వాయర్, తుంగభద్ర, కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ, హంద్రీనది ఉన్నా కల్లూరు అర్బన్ 16 వార్డుల ప్రజలకు తాగునీరు ఇవ్వలేకపోతున్నామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమృత్ స్కీంలో రూ.115 కోట్లు మంజూరు చేసిందని ఆ పనుల్లో పురోగతి లేదని తక్షణమే సంబంధిత పనులు మొదలుపెట్టేలా అధికారులకు సూచించాలని మంత్రిని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మోడల్ ఐటీఐ కాలేజీ స్థాపించాలని అభ్యర్థించారు. ఇండస్ట్రియల్ హబ్‌లో రూ.2800 కోట్లుతో మౌలిక వసతులు, డ్రోన్ హబ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు ఫోర్‌లైన్ రోడ్డును పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు, మంత్రి ఫరూక్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 439 అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 439 అంగన్‌వాడీ కేంద్రాలలో 231 టాయిలెట్లకు గాను 191 పూర్తయ్యాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 41 టాయిలెట్ల నిర్మాణాలు, అలాగే 425 తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 33 తాగునీటి పైపులైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అడవి పందుల బెడద



పందులు నాశనం చేసిన పంట

వెలుగోడు నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి వరి పంటలు వేలాది ఎకరాల్లో సాగు చేశారు. సమృద్ధిగా నీరు లభించడంతో పంట పొలాలు బాగా పండాయి. పంట చేతికొచ్చే సమయంలో రైతులకు అనుకోని దెబ్బలు తగులుతున్నాయి. వెలుగోడు అటవీ సమీపంలోని బొందుల కుంట, ఈదుల చెరువు, మద్రాస్ కెనాల్ వెంట సాగు చేసిన వరి పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయి. చేతికొచ్చిన పంటను తొక్కి చేతికందకుండా చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వంద ఎకరాల్లో అడవి పందులు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవి పందుల బెడద నుంచి కాపాడాలని రైతులు కోరుచున్నారు.

గుడిసె దగ్ధం.. రూ.6 లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

బండి ఆత్మకూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీసీ పాలెం గ్రామంలో గుడిసె దగ్ధమైంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన సమీరా ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో గుడిసెకు మంటలు వ్యాపించాయని గ్రామస్థులు తెలిపారు. ఇంట్లోని ఆరు తులాల బంగారం, రూ.50వేల నగదు, టీవీ, బియ్యం, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయని తహసీల్దార్ ఆల్ఫ్రెడ్ తెలిపారు. బాధితురాలికి సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించి ఉంటుందన్నారు.

బైక్ షోరూం ఉద్యోగి చేతివాటం

కర్నూలు క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు ఘటనల్లో ఆ సంస్థల్లో పని చేసే ఉద్యోగులే చేతి వాటం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళితే.. బజాజ్ షోరూంలో పని చేసే హరికృష్ణ, మునిస్వామిలు వివిధ వాహనాల స్పేర్ పార్ట్స్‌ను విక్రయించి ఆ నగదును వారి ఖాతాల్లో వేసుకున్నారు. ఈ ఘటనను ఆలస్యంగా గుర్తించారు. సీఐ నాగరాజురావు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు ఎస్టేట్ ముజఫర్ నగర్‌కు చెందిన హరికృష్ణ యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. 2016 నుంచి బంగారుపేటలోని బజాజ్ స్పేర్ పార్ట్స్ సేల్స్ అండ్ షోరూంలో ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. ఇదే సంస్థలో మునిస్వామి అనే మరో యువకుడు 2020లో ఉద్యోగంలో చేరాడు. స్పేర్ పార్ట్స్ విక్రయించడంలో సంస్థ పెద్దగా పట్టించుకోకపోవడం, సేల్స్, దాని నగదు గురించి పెద్దగా పట్టించుకోలేదు. దీంతో హరికృష్ణ ఇదే అదునుగా భావించి నాలుగేళ్లుగా స్పేర్ పార్ట్స్‌తో విక్రయించిన సొత్తును తన



నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు

- నాలుగేళ్లుగా స్పేర్ పార్ట్స్ చోరీ
- రూ.2.36 కోట్ల విలువైన పరికరాలు పక్కదారి
- అరెస్టు చేసిన పోలీసులు

ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. కొన్ని స్పేర్ పార్ట్స్‌ను సగం ధరలకే విక్రయించేవాడు. ఇలా నాలుగేళ్లుగా నిరాటంకంగా తన బిజినెస్‌ను కొనసాగించి రూ.2.36 కోట్ల సేల్స్‌ను తన ఖాతాల్లోకి మళ్లించుకున్నాడు. ఇది గుర్తించి మరో ఉద్యోగి మునిస్వామి హరికృష్ణను నిలదీయగా తనను వలలో వేసుకున్నాడు. మునిస్వామికి కూడా నెలా నెలా రూ.10వేల చొప్పున సమర్పించుకుంటూ వచ్చాడు. తీరా ఆ సంస్థ హెడ్ ఆఫీసర్, సిబ్బంది ఆడిట్ చేయగా.. లెక్కల్లో తేడా రావడంతో అనుమానం వచ్చింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి నిందితులిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. హరికృష్ణ వద్ద నుంచి రూ.36.70 లక్షలు, మునిస్వామి నుంచి రూ.6.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

చందన బ్రదర్స్‌లో..

చందనబ్రదర్స్‌లో ఈ నెల 11వ తేదీన జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఆలూరు మండలం హోలేబీడు గ్రామానికి చెందిన సురేష్ చందనబ్రదర్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. తనకు కొంత డబ్బు అవసరం ఉండటంతో ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిసింది. 11వ తేదీ అర్ధరాత్రి తర్వాత ఎవరూ లేని సమయం చూసి షోరూం పై నుంచి ఉన్న కన్నంలో నుంచి కిందకు దూకాడు. అందులో నుంచి కిందకు వచ్చి క్యాష్ కౌంటరులో ఉన్న రూ.2.35 లక్షల నగదును చోరీ చేశాడు. సీసీ కెమెరాల ద్వారా నిందితుని గుర్తించి పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మోహన్ కిషోర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ రవికుమార్, శ్రీనివాసులు, మహేంద్ర, మల్లికార్జునలు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

ఆలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హత్తిబెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుణ్ కుమార్, మౌలా హుసేన్ రాష్ట్రస్థాయి సెపక్ తాక్రా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శివప్రసాద్, పీడీ చిన్న బాబు శుక్రవారం తెలిపారు. కర్నూలులో 21న సెపక్ తాక్రా అండర్ 14బాలుర విభాగంలో ప్రతిభ చూపారని చెప్పారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఈనెల 26,27తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

మాట నిలుపుకున్న చంద్రబాబు



మాట్లాడుతున్న రాయలసీమ హక్కుల వేదిక వ్యవస్థాపకుడు టీజీ వెంకటేశ్

- హైకోర్టు బెంచ్ ఏర్పాటులో మంత్రి టీజీ భరత్ కృషి అభినందనీయం
- మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేశారని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బార్ అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం రాయలసీమ సమస్యలపై పోరాడి, హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు దోహదం చేసిన బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ మూర్తి, రవికాంత్, స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా, న్యాయవాది సయ్యద్‌ఖాద్రీలను టీజీ సన్మానించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ రాయలసీమ హక్కుల ఐక్యవేదిక స్థాపించి 20ఏళ్లు అయ్యిందని, ఇన్నేళ్లకు సీఎం చంద్రబాబు రాయలసీమ ప్రజల కోరికను తీర్చారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని చెప్పి ద్రోహం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు మొదటి నుంచి కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఒకే మాట చెప్పారని, దానికే కట్టుబడి ఆ దిశగా అడుగులు వేయడం అభినందనీయం అన్నారు.

రైతులకు గరుసు దొంగల బెడద



టిప్పర్‌లో గరుసు నింపుతున్న ఎక్స్‌కవేటర్

- పొలాలను రక్షించమంటున్న రైతులు
- రైతుపై దౌర్జన్యానికి దిగిన అక్రమార్కులు

ఆదోని రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అనుచరులు ఆదోని నలువైపులా ఉన్న కొండలను పిండిచేసి గరుసు తవ్వుకొని ఆస్తులు పెంచుకున్నారు. నేడు కూటమి నాయకులు వాళ్లను మించిపోయారు. రాత్రింబవళ్లు ఆదోని చుట్టుపక్కల ఉన్న కొండల్లో గరుసు తవ్వుకొని అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఎమ్మెల్యే పార్థసారథికి కుడిభుజంగా ఉంటున్న గుడిసె కృష్ణమ్మ కనుసన్నల్లో గరుసు తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. గరుసు తవ్వకాల వల్ల రైతులు లబోదిబోమంటున్నారు. ఆదోని పట్టణానికి చెందిన బోయ శ్రీనివాసులు తల్లి బోయ సుజాతమ్మ పేరిట ఎస్. కొండాపురంలో సర్వే నెం.116లో 3.46 ఎకరాల భూమి ఉంది. ఈ పొలం చుట్టూ కొండలు ఉన్నాయి. ఈ కొండల్లో గతంలో టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ అనుచరుడు కపటి గ్రామానికి చెందిన మాధవ అక్రమంగా గరుసు తవ్వకుంటున్నాడు. గరుసును తవ్వడం వలన తమ పంటలు నాశనం అవుతాయని పలుమార్లు రైతు శ్రీనివాసులు, ఆయన తల్లి సరోజమ్మ అడ్డుకోడానికి ప్రయత్నించారు. గరువు తవ్వితే కొండల్లో నుంచి నీరు వచ్చి పంట పొలాలు నాశనమవుతాయని, పొలాలపై మట్టి పడుతుందని రైతు శ్రీనివాసులు తవ్వకాల ఫొటోలను తీశాడు. శుక్రవారం గరుసు తవ్వకాలను అడ్డుకోడానికి రైతు ప్రయత్నించాడు. దానికి తవ్వకాలను ఆపేది లేదని, ఎవరికైనా చెప్పుకోమని కపటి మాధవ దౌర్జన్యానికి దిగాడని రైతు తెలిపాడు. గుడిసె కృష్ణమ్మ అనుచరుడు కపటి మాధవ చేపట్టిన గరుసు తవ్వకాలను ఆపాలని, పొలాలను రక్షించాలని రైతు శ్రీనివాసులు కోరాడు.

నీ కూతురు ఆపదలో ఉంది..

రూ.లక్ష పంపు

- పత్తికొండ వాసికి అగంతకుడి ఫోన్ కాల్
- విదేశాల్లో ఉన్నది కొడుకు కావడంతో మోసాన్ని గుర్తించిన వైనం

పత్తికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ కల్లుపెంట వీధిలో కిరాణం షాపు నడుపుకుంటున్న నజీర్‌కు +923476648113 నంబరు నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి ఇంగ్లీష్ ఆర్ హిందీ అంటూ మాటలు మొదలుపెట్టాడు. హిందీ అని చెప్పడంతో విదేశాల్లో 'మీ కూతురు చాలా ప్రమాదకర పరిస్థితుల్లో ఉంది. మీరు వెంటనే రూ.లక్ష ఈ నెంబర్‌కు ఫోన్‌పే చేయండి సమయం లేదని తొందరపెట్టాడు. దీంతో కంగారుపడ్డ నజీర్ ఏమైందంటూ ప్రశ్నించాడు. 'తన పేరు విజయ్‌కుమార్ అని, మీ కూతురు ఉన్న దేశంలో పోలీస్ ఆఫీసర్‌ను అని, ముందు అర్జంటుగా డబ్బు పంపండి.. మీకూతురు ప్రమాదంలో ఉంది వివరాలు తరువాత చెబుతాను అంటూ' హడావుడి చేశాడు. అయితే విదేశాల్లో హిందువుల పేరు ఉన్న పోలీసు అధికారి ఎలా ఉంటాడన్న ఆలోచన రావడంతో నజీర్ కంగారు వదిలి ఆలోచనలో పడ్డాడు. పైగా విదేశాల్లో ఉన్నది కొడుకు కాగా అవతలి వ్యక్తి కూతురు అని చెప్పడంతో అనుమానం వచ్చింది. అయినప్పటికీ కొడుక్కి ఏమైనా అయిందా అన్న భయంతో తన కూతురు ఎలాంటి ప్రమాదంలో ఉందో వీడియో చూపాలని అడిగాడు. ముందు డబ్బులు పంపు తర్వాత నీ కూతుర్ని చూపిస్తా అంటూ సమాధానం వచ్చింది. నాకు కూతురే లేదు అసలు నువ్వెవ్వరంటూ నజీర్ గట్టిగా మాట్లాడడంతో అవతలి వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. మరోసారి నెంబర్‌కు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో వెంటనే విదేశాల్లో ఉన్న తన కొడుక్కి నజీర్ ఫోన్ చేశాడు. తాను అక్కడ క్షేమంగా ఉన్నానని, అలాంటి ఫోన్ కాల్‌తో జాగ్రత్త అంటూ కొడుకు చెప్పడంతో టెన్షన్ నుంచి తేరుకున్నాడు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి.బెళగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామ సమీపంలో తుంగభద్రనదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్ఐ తిమ్మారెడ్డి సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానులు గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుని ట్రాక్టర్లకు ఉచిత ఇసుక బ్యానర్ కట్టుకోవాలన్నారు. ఎమ్మిగనూరులో 2, పులకుర్తి ఒక ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీహార్ నుంచి తుపాకులు!

- ఆదిలాబాద్ జిల్లాలో సున్నిపెంట వాసితో పాటు ముగ్గురి అరెస్టు
- పిస్టళ్లు, బుల్లెట్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న పిస్టళ్లు, బుల్లెట్లు

ఆదిలాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీహార్ నుంచి తుపాకులను తీసుకొస్తుండగా నలుగురిని తెలంగాణ రాష్ట్రం ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శ్రీశైలం సమీపంలోని సున్నిపెంటకు చెందిన వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తిలో పని చేశాడు. సూర్యాపేటలో తన స్నేహితుడిని చంపేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునేందుకు, అలాగే కర్నూలు జిల్లాలో జనశక్తి పార్టీని పునర్నించేందుకు తుపాకులను కొనుగోలు చేయాలనుకున్నాడు. ఇందుకుగాను నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన వ్యాపారి ప్రసన్నరాజును ఆర్థిక సాయం చేయాలని కోరగా అతడు అంగీకరించాడు. వెంకట్‌రెడ్డి, హేమకాంత్‌రెడ్డి కలిసి సున్నిపెంటకు చెందిన దిలీప్, అతని రెస్టారెంట్‌లో పనిచేసే బిహార్‌కు చెందిన భైరవ్‌తో కలిసి ఇటీవల కాశీకి వెళ్లారు. ఆ తర్వాత భైరవ్ బిహార్‌లోని మ్యుంగార్ రైల్వే స్టేషన్‌కు వెళ్లి పిస్టల్స్, బుల్లెట్లను కొనుగోలు చేశాడు. వాటిని తీసుకొని దిలీప్, హేమకాంత్‌రెడ్డి తిరిగి వస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు గురువారం రాత్రి ఆదిలాబాద్ బైపాస్ రోడ్డు వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాలుగు 7.65 ఎంఎం పిస్టళ్లు, 8 మ్యాగజైన్‌లు, 18 లైవ్ రౌండ్‌లతో పాటు ప్రయాణించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 9 మందిపై కేసు నమోదు చేశారు. కేసులో ప్రధాన నిందితుడు వెంకట్‌రెడ్డి, ప్రసన్న రాజులను శుక్రవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. వెంకట్‌రెడ్డిపై ఇప్పటికే మూడు హత్య కేసులు, హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు, రెండు టాడా కేసులు.. ఇలా మొత్తం 10 కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన ఐదుగురు నిందితుల కోసం ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ప్రత్యేక పోలీసు బృందాలను పంపించినట్లు చెప్పారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి



టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న మండల టీడీపీ అధ్యక్షుడు సురేష్

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికీ అందించే బాధ్యత టీడీపీ కార్యకర్తలు తీసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్ అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని పెంచికల పాడు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండల టీడీపీ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ప్రమాద బీమా ఇన్సూరెన్స్ కింద రూ.5 లక్షలు అందించడంతో పాటు మరిన్ని ప్రయోజకరమైన పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట్రాముడు, కృష్ణ, గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ మద్దిలేటి, కరణం చిన్నగిడ్డయ్య, నాగేష్, రవి, చిదంబర్ రెడ్డి పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్‌ను తగ్గించాలి

కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్



బెలూన్లను ఎగురవేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నదానికి యాంటీ బయాటిక్స్ వాడకాన్ని బాగా తగ్గించాలని కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్ పేర్కొన్నారు. యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని మైక్రో బయాలజీ విభాగం ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యులు, విద్యార్థులు బ్లూకలర్ బెలూన్స్‌లను ఎగురవేశారు. ఈ సందర్భంగా డా.హరిచరణ్ మాట్లాడుతూ విపరీతంగా యాంటీ మైక్రోబియల్ మందులు వాడటం వల్ల వ్యాధులకు మందులు పని చేయవని అన్నారు. మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డా. రేణుకాదేవి మాట్లాడుతూ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై చర్యలు తీసుకోకపోతే రాబోయే కాలంలో వ్యాధుల నివారణ కష్టమని దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.అరుణ, ప్రొఫెసర్ డా.నాగజ్యోతి వైద్యులు పాల్గొన్నారు.

24న శాలివాహన సంఘం కార్తీక వనభోజనాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు నంద్యాల రోడ్డులోని ఏఎంఆర్ ఫంక్షన్ హాలులో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కే.సోమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజారప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో కార్తీక వనభోజనం సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, నంద్యాల పార్లమెంటు ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరితరెడ్డి, బొగ్గుల దస్తగిరి, నగర మేయర్ బీవై రామయ్య, రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, తుగ్గలి నాగేంద్రలు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కుమ్మరులందరూ అధిక సంఖ్యలో హాజరై కార్తీక వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం నాయకులు నాగన్న, నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వజన కార్తీక వనభోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న ఓర్వకల్లు మండలం, బొడ్డువానిపల్లె గ్రామంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సర్వజన కార్తీక నభోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పునులూరు గ్రామ వాస్తవ్యులు పల్లె ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, ఓర్వకల్లు, కల్లూరు, వెల్దుర్తి మండల భక్తాదులంతా ఈ వనభోజన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ వనభోజన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధుల చేతప్రత్యేక పూజలు, గోపూజ, నందికోల సేవ, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలకు ఆటల పోటీలు, సాయంత్రం కార్తీక దీపోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు.

● ఎస్పీకి ఆహ్వానం..

సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో 24న నిర్వహిస్తున్న బ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవానికి నగర బ్రాహ్మణ సంఘం నాయకులు ఎస్పీ బిందుమాధవ్‌ను ఆహ్వానించారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో బిందుమాధవ్‌ను కలిసిన బ్రాహ్మణులు ఆయనకు వేద ఆశీర్వాదం ఇచ్చారు. అనంతరం నగర బ్రాహ్మణ సంఘం నిర్వహిస్తున్న వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను ఎస్పీకి వివరించారు. అలాగే ఈ నెల 24న సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో నిర్వహించే కార్తీక వనభోజన కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు హాజరవుతారని, కార్యక్రమంలో నగర బ్రాహ్మ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు టీవీ రవిచంద్ర శర్మ, ఇతర ప్రతినిధులు సీవీ దుర్గాప్రసాద్, సముద్రాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకు రోడ్లపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి అన్నారు.శుక్రవారం ప్రతినిధి బృందం కాలనీ ప్రతినిధులతో కలిసి నంది కొట్కూరు రోడ్డు, వెంకటరమణ కాలనీ, బళ్లారి రోడ్లతో పాటు ప్రధాన కూడళ్లను పరిశీలించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరం జిల్లా కేంద్రామైనప్పటికీ జనాభాకు సరిపడా రోడ్ల విస్తరణ జరగలేదన్నారు. అంతేగాకుండా ఆర్‌అండ్‌బీ ఇంజనీరు అశాస్త్రీయంగా డివైడర్లు, కల్వర్టులు నిర్మించడం, శిథిలమైన వాటిని పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్, ఎస్పీ, నగర పాలక కమిషనర్ తక్షణమే స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పివి.వర్మ, ఎస్ఆర్.గౌడు, ఎన్.పీటర్, శంకరావు, జీవి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాంటన్ తెలుగు బాప్టిస్టు చర్చి ఎన్నికలు ఏకగ్రీవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాసనగర్‌లోగల స్టాంటన్ తెలుగు బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చర్చి ఎన్నికల కమిటీ చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జరిగిన ఎన్నికలో చర్చి జనరల్ బాడీ చైర్మన్ గిడియన్ గాడీ, ఎన్నికల కమిటీ సభ్యుడు ప్రభాకరరావు, సెక్రటరీ యు కృపాదానం తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పదిమంది కార్యవర్గ సభ్యులకు సంబంధించి మొదటి విడతలో ఐదుగురులో ఒకరు ఉపసంహరించుకోగా నలుగురు ఏకగ్రీవమయ్యారని తెలిపారు. రెండో విడతలో ఐదు మంది నామినేషన్ వేసి ఐదుగురు పోటీ లేనందున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. చర్చి జనరల్ బాడీ చైర్మన్‌గా ఎంఎల్ గ్లోరి ప్రకాశ్, కార్యదర్శిగా ఎస్ రవిచంద్రకాంత్, కోశాధికారిగా డేవిడ్ పాల్, స్టాండింగ్ కమిటీ సెక్రటరీగా జాన్ జోయల్, సీనియర్ డీకాన్‌గా బి. రాజశేఖర్, సీనియర్ డీకానస్‌గా సీహెచ్ సరోజమ్మ, సండే స్కూల్ సూపరింటెండెంట్‌గా ఆర్ బీబీరాణి, యూత్ డైరెక్టర్‌గా వసుంధర దేవి, ప్రాపర్టీ కమిటీ చైర్మన్‌గా జి. జోసఫ్ మనోహర్, మహిళా అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం. దేవకృప ఎన్నికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 24న ప్రమాణ స్వీకారం చేస్తారని, వీరి పదవీ కాలం ఏడాది పాటు ఉంటుందని తెలిపారు.

పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి



పెద్దటేకూరులో అర్హులకు ఇంటి స్థలాల కోసం ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదప్రజలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో పేదలు నివసిస్తున్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సచివాలయం వరకు ర్యాలీ చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని 50 మంది దరఖాస్తులను సచివాలయ సెక్రటరీ సంజీవరావుకు అందజేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రాముడు, మనిసా, తులసీ, శివ, సుమతి, రంగన్న, సుధాకర్, గిడ్డయ్య, సంజన్న, రామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును జయప్రదం చేయండి

గూడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరి రివిజన్-2025లో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శని, ఆదివారం అన్ని పోలింగ్ బూత్‌లలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారనీ, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన



సీసీ రోడ్ల పనులను పరిశీలిస్తున్న నాయకులు

సి. బెళగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులను మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు , టీడీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. రూ. 40 లక్షల సీసీరోడ్లు నిర్మిస్తున్నామని అన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజివెంకటేశ్, బాషా, గౌవుస్, తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

తాగునీటి పథకాలను శుభ్రం చేయాలి

సి. బెళగల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు, సంగాల,తిమ్మనదొడ్డి, సిబెళగల్ గ్రామపంచాయతీలలోని తాగునీటి పథకాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈ గోనెనాయక్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం తాగునీటి పథకాలను పరిశీలించారు. డీఈ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయా గ్రామాలలోని తాగునీటి పథకాలు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, మురుగుకాలువలోని తాగునీటి పైపులైన్లు తొలగించి కొత్తపైపులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆయా గ్రామాలలో కాలిపోయిన తాగునీటి విద్యుత్ మోటార్ల, చేతిపంపులను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఆయన వెంట ఏఈ గోనెనాయక్ ఉన్నారు.

కుడా చైర్మన్‌కు సాంస్కృతిక విభాగం సన్మానం



సోమిశెట్టిని సన్మానిస్తున్న పద్మాచౌదరి

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును సాంస్కృతిక విభాగం సన్మానించింది. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమిశెట్టి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆశయ సాధ కోసం తెలుగు దేశం పార్టీని, ప్రజల కోసం సేవలందించడానికి ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాలన్నారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. 25న ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మి పద్మాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో ఘనంగా ఫిజియాలజీ వారోత్సవాలు



మెడికల్ కాలేజీ మొదటి ప్రిన్సిపాల్ వెంకటరామయ్యకు నివాళి అర్పిస్తున్న వైదులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించే ప్రపంచ ఫిజియాలజీ వారోత్సవాలను కర్నూలు మెడికల్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు వారోత్సవాల సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీ మొట్టమొదటి ప్రిన్సిపాల్ డా.వెంకటరామయ్య విగ్రహానికి కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ డా.అమీరున్నీసా బేగంలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజియాలజి వైద్యులు మాధవీలత, ఎలిజిబెత్ రాణి, బేబి సాయిరాణి, ఉమా, సోఫియా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఫుడ్ బాస్కెట్ అమలుపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఓర్వకల్లు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఫుడ్ బాస్కెట్ అమలుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో డీపీఎం చంద్రశేఖర్, డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఆహార పదార్థాలు వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంలో మహిళా సంఘాల పాత్ర కీలకమన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన ఎలా చేపట్టాలనే ఫుడ్ బాస్కెట్ అమలు చేయడంలో మండల సమైఖ్య పాత్ర ఎలా పని చేస్తుందనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకట్రామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీలేఖ, వంశీకృష్ణ, మల్లికార్జున, జగదీష్, అరుణ పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తాం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిద గ్రామాల్లో పనులు లేక ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని గ్రామ సచివాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరం పనుల గుర్తింపు పై గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ఏపీవో కుమార సాయినాథ్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ కూలీలకు ఉపాది పనులు కల్పించేందుకే గ్రామ సభలు ఏర్పాటు చేసి పనులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ పనుల్లో రాతి కట్టడాలు, చెరువుల్లో పూడికతీతా, నీటి కుంటలు, పొలాలకు రోడ్లు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రంగనాథగౌడు, నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపాధి కూలీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● కమిషనర్ ఎస్. రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరమంతా పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం నగరంలోని పలు వార్డులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయా కాలనీల ప్రజలు చేసిన ఫిర్యాదు ప్రదేశాలను కమిషనర్ పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని స్థానికులకు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్థానికుల అభ్యర్థులను పరిగణలోకి తీసుకుని తక్షణమే సంబంధించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేష్, డీఈఈలు క్రిష్ణలత, మనోహర్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, దామోదర్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు అనిల్, వలి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి కుంభోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కోడుమూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరిదేవి కుంభోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆటగార దేవాంగ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు చేపట్టారు. మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే కుంభోత్సవ వేడుకలు భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు హంద్రీనదిలోని నీటిని తీసుకొచ్చి గంగమ్మ పూజ, గంగా హరతి అలాగే ఆలయంలోని ఉమామహేశ్వరస్వామి శివలింగంకు జలాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేఖర్, విరుపాక్షి, నాగరాజు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, విజయ్, నాగప్ప, వేణుగోపాల్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌కు రిపోర్టు చేయాలి

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24, 26 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే అండర్-14 బాలబాలికల బేస్‌బాల్ పోటీలకు హాజరయ్యే కర్నూలు ఉమ్మడి జిల్లాల జట్లు శనివారం నంద్యాల రైల్వేస్టేషన్‌లో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని కార్యదర్శులు గిడ్డయ్య, శ్రీనాథ్‌లు తెలిపారు. అలాగే అండర్-14 బాలబాలికల త్రోబాల్ ఉమ్మడి జిల్లాల జట్లు ఈ నెల 28న నంద్యాల డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని కార్యదర్శులు తెలిపారు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో హాజరు కావాల్సి ఉంది. అలాగే స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ అండర్-18 బాలుర ఉమ్మడి జిల్లాల జట్లు ఈ నెల 28న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం నంద్యాలలో రిపోర్టు చేయాలని వారు తెలిపారు. 29, 30 తేదీల్లో తూర్పుగోదావరిలోని జడ్పీహెచ్ఎస్ బిక్కవోలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు హాజరు కావాలని తెలిపారు. అలాగే అండర్-19 ఫెన్సింగ్ బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీలు 26న నంద్యాల డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. క్రీడాకారులు ఎలిజిబిలిటీ ఫామ్స్, గత సంవత్సరం మార్క్‌లిస్టు, ఆధార్ జిరాక్స్ బోనఫైడ్ సర్టిఫికెట్ అదనంగా 2 ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఆర్‌యూలో కారుణ్య నియామకం



కారుణ్య నియామక ఉత్తర్వులు అందిస్తున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, నవంబరు 22(ఆంధ్ర జ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఆచార్యులుగా పనిచేస్తూ విధుల్లో మరణించిన శ్రీనివాసరావు కుటుంబానికి కారుణ్య నియామకం కింద ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుతో కలిసి ఆదిశంకర్ నారాయణకు నియామకం ఉత్తర్వులు అందించారు. దూర విద్యాకేంద్ర డైరెక్టరుగా, రిజిస్ట్రార్‌గా నిర్వర్తించిన శ్రీనివాసరావు బాధ్యతలకు గుర్తింపుగా నియామకం చేపట్టామని తెలిపారు.

పొంచి ఉన్న నీటి ఎద్దడి

- దెబ్బతిన్న బసాపురం ఎస్ఎస్ ట్యాంకు కాంక్రీట్
- సగం కూడా నింపలేని దుస్థితి
- మరమ్మతులు చేస్తే తప్ప.. ఆదోని ప్రజల దాహార్తి తీరదు



బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో అడుగంటిన నీరు

శాశ్వత మరమ్మతులే పరిష్కారం

గత వైసీపీ ప్రభుత్వం చెరువుకు శాశ్వత మరమ్మతులు చేయకుండా, తాత్కాలిక పనులు చేసింది. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. చెరువు చుట్టూ మూడున్నర కిలోమీటర్ల మేర ఉన్న గట్టుకు సీసీ లైనింగ్ కన్నా రాతి పరుపు (స్టోన్ పిచ్చింగ్) వేస్తే తప్ప క్షేమం కాదని నిపుణులు సూచిస్తారు. కూటమి ప్రభుత్వం అయినా చెరువుకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న చెరువు గట్టు కాంక్రీట్ లైనింగ్

ఆదోని టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ జనాభా దాదాపు 2.5లక్షలు. 19వేల కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. పట్టణ ప్రజలకు రోజు 25మిలియన్ల లీటర్ల నీరు అవసరం కాగా, ప్రస్తుతం 22మిలియన్ల లీటర్ల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు.

బసాపురం ట్యాంకు నుంచే సరఫరా

పట్టణ ప్రజల ప్రధాన తాగునీటి అవసరాలు తీర్చేందుకు లో బసాపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును 2004లో నిర్మించారు. పూర్తి సామర్థ్యం 3,110 మిలియన్ లీటర్లు కాగా, ట్యాంకు దెబ్బతినడంతో సగం కూడా నింపే పరిస్థితి లేదు.

దెబ్బతిన్న కాంక్రీట్

చెరువు గట్టుకు వేసిన కాంక్రీట్ దెబ్బతింది. నల్లరేగడి కావడంతో చెరువు గట్టును బలోపేతం చేయడానికి శాశ్వత మరమ్మతులు చేయాలని గతంలోనే నిపుణులు సూచించారు. ఇందుకు సుమారు రూ.34కోట్లు అవసరం. గతంలో వైసీపీ ప్రభుత్వం అరకొర నిధులతో మరమ్మతులు చేసి వదిలేశారు. అయితే అప్పుడు చేసిన పనులు దెబ్బతిన్నాయి.

వేసవిలో పొంచి ఉన్న ముప్పు

వేసవిలోపు బసాపురం చెరువు గట్టుకు మరమ్మతులు చేయకుంటే ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉంది. గట్టుకు వేసిన సిమెంట్ కాంక్రీట్ చాలా భాగం దెబ్బతినడంతో చెరువులో పూర్తి సామర్థ్యంతో నీటిని నింపకోవడం సాధ్యం కావడం లేదు. కూత వేటు దూరంలో ఎల్ఎల్సీ ఉన్నా, చెరువును పూర్తిగా నింపితే, గట్టు తెగిపోతుందన్న భయం అధికారుల్లో ఉంది.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



చెరువు శాశ్వత మరమ్మతులకు రూ.34 కోట్లతో ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. అమృత్, జల్ జీవన్ పథకాల్లో నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి పంపిస్తున్నాం. నిధులు మంజూరు అయితే పనులను ప్రారంభించి పూర్తి చేస్తాం. **కృష్ణ, కమిషనర్, ఆదోని మున్సిపాలిటీ**

ఫసల్ బీమా నమోదు చేసుకోండి

దేవనకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు ఫసల్ బీమా నమోదు చేసుకోవాలని ఏవో సురేష్‌బాబు సూచించారు. జొన్న, టమోట, వేరుశెనగ, ఉల్లి పంటలకు మీసేవా, సీఎస్సీ కేంద్రాలలో డిసెంబరు 15లోగా దరఖాస్తు చేయాలని, ఎకరానికి జొన్న రూ.297, టమోట రూ.1500, వేరుశెనగ రూ.480, పప్పుశెనగ రూ.420, ఉల్లి రూ.1350ల ప్రకారం ప్రీమియం చెల్లించాలన్నారు.

రేపు కమ్మ సంఘం వన భోజనం

పత్తికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రమ్య రిసార్ట్‌లో ఆదివారం కాకతీయ కమ్మ సంఘం కార్తీక వన భోజన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేలూరు రామప్ప, జగ్గు రాంబాబు తెలిపారు. కాకతీయ కమ్మ కుటుంబాలు వచ్చి ఈ వన భోజనాలకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

బెంచ్ ఏర్పాటు హర్షణీయం

ఆలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశ పెట్టడం హర్షణీయమని టీడీపీ యువనాయకుడు వెంకటేష్ చౌదరి, లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం బెంచ్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

రేపు వాల్మీకుల వన భోజనం

దేవనకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల కార్తీక వన భోజన మహోత్సవం ఆదివారం ఉంటుందని, జయప్రదం చేయాలని సంఘం నాయకుడు కప్పట్రాళ్ల మల్లికార్జున తెలిపారు. ఆలూరు శీతెల్లిగుండంలోని ఆలయంలో నిర్వహిస్తామన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

తుగ్గలి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. శుక్రవారం తుగ్గలి ఏపీవో కార్యాలయంలో మాట్లాడుతూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సీసీ ప్రదీప్ కుమార్, టీఏలు, ఎఫ్ఏలు, మేటీలు ఉన్నారు.

చంద్రబాబుతోనే ప్రాజెక్టుల నిర్మాణం



మాట్లాడుతున్న కురవ దేవేంద్రప్ప

ఆలూరు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాధ్యమని టీడీపీ రైతు కమిటీ తాలూకా అధ్యక్షుడు కురవ దేవేంద్రప్ప, మరకట్టు నర్సింది బురిజింటి ఎల్లప్ప అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు నిర్మించి సాగు, తాగునీరు అందిస్తామని అసెంబ్లీలో సీఎం ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వేదవతి నగరడోణ ప్రాజెక్టులను నిర్మించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అనుభవం కలిగిన చంద్రబాబుతోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. వెంకటేశ్వర్లు, బసవరాజు, ఎం మల్లప్ప పాల్గొన్నారు.

వన భోజనాన్ని విజయవంతం చేయండి

పత్తికొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 24న కర్నూలులో నిర్వహించనున్న కురువల వనభోజనం విజయవంతం చేయాలని కురవ సంఘం జిల్లా అధ్యక్షుడు, కురవ కార్పొరేషన్ మెంబర్ వర్ల శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. శుక్రవారం కరపత్రాలను విడుదలచేశారు. కర్నూలు పెదపాడు సమీపంలో బీమలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉంటుందన్నారు. కురవ సంఘం నాయకులు తిప్పన్న, వర్దరాజ్, వర్దప్రకాష్, వర్ల భాస్కర్, ఎరుకల చెరువు సురేంద్ర, అల్లెప్ప, మునిస్వామి, వక్కీరప్ప ఉన్నారు.

చదువుతో పాటు నైపుణ్యం ఉండాలి

ఆస్పరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి నైపుణ్యం ఉండాలని విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ అంజినేయ శాస్త్రి, హెచ్ఎం విజయకుమారి సూచించారు. ఒకేషనల్ ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 33/11 కేవీ ఉప విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ ఎలా సరఫరా అవుతుందో, విద్యుత్తును ఎలా వినియోగించుకోవాలనే అంశాలతో పాటు విద్యుత్ సరఫరా అయ్యే వివిధ రకాల ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఏఈ మాట్లాడుతూ ఉపాధి యుగంలో విద్యార్థులు సాంకేతిక, వృత్తివిద్యలో నైపుణ్యం ప్రదర్శించాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు వృత్తి విద్య కోర్సుల ద్వారా త్వరగా ఉపాధి అవకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. శివకుమార్, రాజు, మరియు ఉపాధ్యాయులు ఆనంద్, బాబు, విద్యు సబ్ స్టేషన్ ఆపరేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఎస్టీ రిజర్వేషన్



నివాళి అర్పిస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

ఆలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమని మాజీ మంత్రి గుమ్మనూర్ జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన జన్మదిన సందర్భంగా బస్టాండ్‌లో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ బీసీలకు ఎప్పుడూ జరుగుతుందన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి పెట్టారని, అందులో భాగంగానే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేశారన్నారు. వీరేష్, కుప్రాల మల్లికార్జున, వీరంజి, అమ్మయ్య, గోవింద్, మణయ్య పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆస్పరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జొహారాపురం గ్రామంలో పేకాటరాయళ్లను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. రూ.22వేలు, 7 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కొందరు పారిపోయారని, వారిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

క్షయ నిర్మూలనే ధ్యేయం



సూచనలు ఇస్తున్న జిల్లా క్షయ అధికారి

దేవనకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనే ధ్యేయమని క్షయ లెప్రసీ జిల్లా అధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీని తనిఖీ చేసి, ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రజలు మద్యం, ధూమపానం లాంటి దురలవాట్లతో క్షయ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వైద్యాధికారి విజయ భాస్కర్ ఉన్నారు.

పండ్ల సాగుకు ప్రోత్సాహం



పంటను పరిశీలిస్తున్న పీడీ

దేవనకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పండ్ల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందని పీడీ వెంకటరమణయ్య అన్నారు. ఆడిషనల్ పీడీ మాధవిలత ఆయన మండలంలోని కరిడేముల వద్ద చీని తోటలో అంతరపంటగా సాగుచేసిన వేరుశెనగను పరిశీలించారు. ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు, వ్యవసాయ యంత్రాలను అందజేస్తుందని సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలన్నారు. ఏపీడీ వక్కీరప్ప, ఏపీవో కృష్ణమూర్తి, రైతులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- అనధికారిక లే అవుట్లపై చర్యలు తీసుకోండి
- పది విద్యార్థులకు డిసెంబరు 1 నుంచి వర్చువల్ బోధన
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పత్తికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను డిసెంబరు 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం పత్తికొండ గోపాల్‌ప్లాజాలో డివిజన్ రెవెన్యూ, ఇతరశాఖల అధికారులతో ఆర్డీవో భరత్ నాయక్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కోర్టులో ఉన్న భూముల వివరాలను రెవెన్యూ అధికారులు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. కోర్టుకేసులు, లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులు ఉండకూడదని, వారంలోపు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజావేదిక దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలన్నారు. రీసర్వే గ్రామసభలలో డివిజన్ పరిధిలో 5,389 పిటిషన్‌లు వచ్చాయని, పరిష్కరించాలన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని, నకిలీ విత్తనాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల తోటలపెంపకం విషయాలను అడిగి తెలుసుకున్నారు. పశుసంవర్ధకశాఖ లక్ష్యాలను చేరుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు ఉపాధి పనులను పరిశీలించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ 1నుండి వర్చువల్ బోధన ప్రారంభించాలన్నారు. తాగునీటి ట్యాంకుల పరిస్థితిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. జేసీ నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లాకళ్యాణి అధికారులు పాల్గొన్నారు.

నీటి సంఘాలకు డిసెంబరు 5న నోటిఫికేషన్ : జేసీ

నీటిసంఘాల ఎన్నికలకు డిసెంబరు 5న నోటిఫికేషన్ విడుదల చేస్తామని జేసీ నవ్య తెలిపారు. 8వ తేదీన ఎన్నికలు ఉంటాయన్నారు. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14న ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

పరీక్షలకు వంద రోజుల ప్రణాళిక

- పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి
- డీఈవో శ్యామ్యూల్ పాల్



స్టడీ అవర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు వంద రోజుల ప్రణాళిక రూపొందించామని డీఈవో శ్యామ్యూల్ పాల్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని విరుపాపురం జడ్పీ పాఠశాలలో ప్రత్యేక తరగతులను తనిఖీ చేశారు. పాఠ్యపుస్తకాలను తీసుకొని ప్రశ్నలను అడిగారు. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా పాఠాలు వివరించారు. ప్రత్యేక తరగతుల ఉపయోగాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవోలు, హెచ్ఎంలను ఆదేశించారు.

బాలికలు ఉన్నత స్థాయికి చేరాలి

ఆస్పరి: బాలికలు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని డీఈవో శ్యామ్యూల్ పాల్ కోరారు. శుక్రవారం కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. నీటి సమస్య పరిష్కరించాలని విద్యార్థులు డీఈవోకు విన్నవించారు.

అపార్ నమోదు పూర్తి చేయాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ రిజిస్ట్రీ(అపార్) ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని సెప్రారా మెమోరియల్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అపార్ నమోదుకు అలసత్వంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వ్యక్తిగత వివరాల్లో తేడాలు, ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఆధార్ కేంద్రంలో విద్యార్థుల వివరాలను తప్పు ఉంటే సరి చేసుకునేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు 60 శాతంపైగా పూర్తి చేశామని మిగిలిన వివరాలు కూడా విద్యార్థుల వివరాలు సరిచూసుకొని వచ్చిన వెంటనే అపార్ నమోదు చేస్తామని తెలిపారు. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సుధాకర్, ప్రహ్లాద్, అనిల్ ప్రసాద్, మారయ్య శ్రీనివాసులు ఉన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ నిర్ణయంపై హర్షం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

పత్తికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షణీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, టీడీపీ లీగల్ సెల్ సభ్యుడు సురేష్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు తుగ్గలి నాగేంద్ర అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల న్యాయవాదులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే శ్యాంబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పత్తికొండలో సీనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు ఏర్పాటుకు ఎమ్మెల్యే న్యాయశాఖ మంత్రి, కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడం హర్షణీయమన్నారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే కేన్సర్ పరీక్షలు



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మద్దికెర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దనే కేన్సర్ పరీక్షలు చేస్తామని, 18 ఏళ్లు నిండిన వారంతా వైద్యసిబ్బందికి సహకరించాలని వైద్యాధికారి రాగిని కోరారు. శుక్రవారం బురుజుల గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, గీతాంజలి, సరస్వతి ఉన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

పత్తికొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని రాజారెడ్డినగర్ బాధితులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ ఇన్‌ఛార్జి క్రాంతి నాయుడు కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాలనీ ఏర్పాటులో అక్రమాలపై లోకాయుక్తలో కేసు వేశారన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు కలెక్టరేట్ విచారణ చేసిన తహసీల్దార్, హౌసింగ్ డీఈలతో కమిటీ ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయంలో బాధితులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పత్తికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ కన్వీనర్ గోవర్ధన్ నాయుడు కలెక్టర్ రంజిత్ బాషాను వినతిపత్రాన్ని అందించారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలల వేతనాలు పెండింగ్ ఉండడంతో విధుల్లోకి రావడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గోవర్ధన్ నాయుడు తెలిపారు. దండిమల్లికార్జున, పూనామల్లికార్జున, హోసూరు బ్రహ్మయ్య, శంకరయ్యఆచారి ఉన్నారు.

పాఠశాలకు విరాళం

వెల్దుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లె జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి గ్రామపెద్ద సింగార్ కాంతారెడ్డి దూపాడ లక్షలు విరాళం ప్రకటించారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న హిందీ ఉపాధ్యాయుడు బాజాబేగ్ దంపతులను శుక్రవారం ఊరేగించారు.

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

హాలహర్వి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని గ్రంథాలయ అధికారి రవీందర్ రెడ్డి శుక్రవారం సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉమాకాంత్ స్వామి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి నవ్యుడు నరేష్, మండల కార్యదర్శి శివ పిలుపునిచ్చారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. విజయనగరంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నామని తెలియజేశారు. ఉపేంద్ర, లక్ష్మణ్, శివ పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని మాల మహానాడు జేఏసీ నాయకులు సురేష్, తలారి అంజనేయులు, కుమారస్వామి పిలుపు నిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ నగర్‌లో మాలల ఆత్మీయ సమ్మేళన పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 29న జేపీ గార్డెన్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును మాలలు, ఉపకులాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. జాతీయ నాయకుడు కొండలరావు, మాదాసుస్వామి, మాజీ ఎంపీ హర్షకుమార్, దామోదర్, రాధాకృష్ణ ఆశోక్ కుమార్ పాల్గొంటారన్నారు. సాయిరాం, బొప్పేలి, నీలకంఠ, చంద్రశేఖర్, నరేష్, శ్రీనివాసులు, అరవింద పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లను చింపేసిన ఎంపీడీవో?



చింపేసిన కాగితాలను చూపిస్తున్న ఏపీవో

ఆదోని రూరల్ నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాను ఇచ్చిన డ్యూటీ సర్టిఫికెట్లను ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ చింపివేశారని ఇన్‌ఛార్జి ఏపీవో జాలీక్, ఉపాధి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తన బంధువు టెక్నికల్ అసిస్టెంట్ హనుమేష్ మాట విని తనను ఎంపీడీవో వేధిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చిన ఎంపీడీవో వేతనాలకు సంబంధించిన డ్యూటీ సర్టిఫికెట్లపై సంతకాలను పెట్టాలని కంప్యూటర్ ఆపరేటర్ హరిశ్‌కుమార్ కోరగా, ఆ పేపర్లను ఎంపీడీవో చింపివేశారని తాను చేసిన తప్పు ఏంటి, ఇలా అయితే ఉద్యోగం చేయలేమన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లను చింపలేదు

డ్యూటీ సర్టిఫికెట్లను నేను చింపలేదు. పని సరిగా చేయపోవడంతో తిట్టాను. సాయంత్రం వేతనాల డ్యూటీ సర్టిఫికెట్లపై సంతకాలు చేశాను. **రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో, ఆదోని**

పేదలకు స్థలాలు ఇవ్వాలి

మద్దికెర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల రైతు సంఘం అధ్యక్షుడు హనుమన్న, కార్మిక సంఘం అధ్యక్షుడు కోదండరాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ మండలంలోని రైతులకు పంటల బీమా పరిహారం చెల్లించాలని కోరారు. ఈ నెల 24న రామలింగేశ్వర ఆలయంలో వనభోజనాలు ఉంటాయన్నారు. మద్దిలేటి, నాగిరెడ్డి ఉన్నారు.

యంత్రాల ఉపయోగంతో అధిక దిగుబడి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



- మద్దికెర ఏవో ఉప్పర రవి

మద్దికెర, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఏవో రవి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: మండలంలో సాగు విస్తీర్ణం ఎంత?

జవాబు: 8 పంచాయతీల్లో ఖరీఫ్, రబీలో 22,500 హెక్టార్లలో పంటలను సాగు చేస్తున్నారు.

ప్రశ్న: అన్ని గ్రామాల్లో ఈక్రాప్ నమోదు చేశారా?

జవాబు: మండలంలో 98శాతం ఈ క్రాప్ నమోదు చేశాం.

ప్రశ్న: ఎరువులను సమృద్ధిగా అందించారా?

జవాబు: మండలంలో రైతులకు అవసరం కంటే ఎక్కువగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే ఎరువులు అందించాం.

ప్రశ్న: యంత్ర పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: యంత్ర పరికరాలతో పంటలను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చు. రైతులకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి?

జవాబు: వ్యాపారులు దుకాణంలో ధరల బోర్డు పెట్టి అమ్ముతున్నారు. ధరలు అధికంగా అమ్మడం లేదు.

ప్రశ్న: రైతులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా?

జవాబు: ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ రైతులకు అందిస్తున్నాం.

రోడ్లపైనే చెత్తాచెదారం

ఇబ్బంది పడుతున్న ప్రజలు



కోసిగిలోని దొరలచావిడి వద్ద పడేసిన చెత్తాచెదారం

కోసిగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో చెత్తాచెదారం రోడ్లపైనే పారవేస్తున్నారు. దీంతో కొండుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌కు వెళ్లే రహదారి వద్ద చెత్తచెదారం పడి నెలలు గడుస్తున్నా పారిశుధ్య కార్మికులు ఎలాంటి పనులు చేపట్టడం లేదు. అలాగే కడపాలెం చౌడేశ్వరి దేవాలయం ప్రధాన రోడ్డుపై చెత్తకుప్పలు ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన వీధుల్లో చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తకుండీలను ఏర్పాటు చేసి, వాటిలో పారవేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్ రోడ్డులో చెత్తాచెదారం

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

● డీఎస్పీ ఉపేంద్రబాబు



మంత్రాలయంలో ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. శుక్రవారం రాత్రి మంత్రాలయం, మాధవరం పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకుముందు మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ నియంత్రణపై మధ్వమార్గ్ కారిడార్, ఎంటీఆర్ సర్కిల్, నదితీరం, 200 గదుల సముదాయం, నాగులదిన్నె రోడ్డు, హెలిపాడ్ గ్రౌండు ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి మఠం అధికారులు, రెవెన్యూ, పంచాయతీ అధికారుల సమన్వయంతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక, మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ వెంట మంత్రాలయం సీఐ రామాంజులు, మంత్రాలయం మాధవరం ఎస్‌ఐలు పరమేష్ నాయక్, విజయకుమార్, రాఘవేంద్ర, రామకృష్ణ లక్ష్మన్నగౌడు, గోవిందు తదితరులు ఉన్నారు.

టెక్స్‌టైల్స్ పార్కును సాధించిన ఘనత బీవీదే



మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ తాలుకా నాయకులు

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ తీసుకవచ్చిన ఘనత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిదేనని టీఎన్ఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు సురేంద్రరెడ్డి, రంజిత్‌బాషా, బొగ్గు రమేష్ నాయుడు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుతో ప్రత్యక్షంగా 10వేల మందికి, పరోక్షంగా మరో ఐదువేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అసెంబ్లీ సమావేశాలలో టెక్స్‌టైల్ పార్కును మంజూరు చేయించి అందుకు కావాల్సిన 77 ఎకరాల భూమిని సేకరించేందుకు మంత్రి సమితమ్మతో అసెంబ్లీలో బిల్లు పాస్ చేయించడం హర్షనీమన్నారు. నియోజకవర్గ ప్రజలు బీవీకి రుణపడి ఉంటారని తెలిపారు. సమావేశంలో రామనాయుడు, రాంపురం రఫీక్, హరిచౌదరి పాల్గొన్నారు.

మార్చి ఆఖరులోగా పూర్తి చేసుకోవాలి

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మంజూరైన ప్రభుత్వ గృహాలను వచ్చే ఏడాది మార్చిలోగా నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ఎస్వీ ప్రసాద్ కోరారు. శుక్రవారం గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశం భవనంలో ఆయన మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలోని 28 గ్రామాల్లోని లబ్ధిదారులకు గత ప్రభుత్వం 1176 పక్క గృహాలను మంజూరు చేసిందన్నారు. అందులో 422 గృహాలుపూర్తి అయ్యాయని మిగతా గృహాలు పలు స్టేజీల్లో నిలిచి పోయాయని అన్నారు. అలాగే పీఎంఏవై పథకం కింద మండలకు 343 గృహాలు మంజూరు కాగా, అందులో 45 గృహాలు పూర్తి అయ్యాయని మిగతా గృహాలు పలు స్టేజీల దగ్గర నిలిచిపోయాయని తెలిపారు. లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి చివరి లోగా నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని కోరారు.


రోడ్డు పనులకు శ్రీకారం



రాఘవేంద్రపురంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రపురంలో రూ.10లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు వరదరాజులు, అశోక్ రెడ్డి శ్రీకారం చు ట్టారు. శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు సదును చేయించారు. వారు మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. మట్టిరోడ్డు లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో హసీనా, నాయకులు రాఘవేంద్ర, శివ, డేవిడ్, మరియప్ప, రాజశేఖర్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు



పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ సభ్యత్వం అందజేస్తున్న కొండయ్య చౌదరి

ఎమ్మిగనూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం పట్టణంలోని 22వ వార్డులో మాజీ కౌన్సిలర్ కొండయ్య చౌదరి వార్డులో తిరిగి పలువురికి టీడీపీ సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం ప్రతిఒక్కరు తీసుకోవాలన్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని 34వార్డుల్లో టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం ఆయా వార్డు ఇన్‌చార్జీలు, మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలో మూడు మద్యం దుకాణాలు ఉన్నాయని, ఈ మద్యం షాపులకు అనుబంధంగా కానీ, మరేవిధంగా కానీ, మండల పరిధిలో ఏ గ్రామంలోనైనా సరే మద్యం బెల్ట్‌షాపు నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు గాని ఎక్సైజ్ డిపార్టుమెంట్‌కు కాని తెలియజేయాలని ఆలా తెలియజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఈ అన్నం మీరు తింటూరా?

● బాత్‌రూముల్లో నీరు లేకపోతే విద్యార్థులు ఎక్కడకు వెళ్లాలి
● కోసిగి హాస్టల్ వార్డెన్‌పై డీఈవో ఆగ్రహం
● ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తనిఖీ



ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న డీఈవో

కోసిగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహారాన్ని మీరు తింటారా...? అసలు ఈ భోజనం ఒక్కసారైనా రుచి చూశారా...? హాస్టల్‌లోని బాత్‌రూముల్లో నీరు లేక దుర్వాసన వస్తోంది.. విద్యార్థులకు రోగాలు రావా..? అంటూ జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆకస్మికంగా డీఈవో తనిఖీ చేశారు. విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కనీసం ఇంగ్లిషులో చదవడం, రాయడం కూడా రావడం లేదని ట్యూటర్ కూడా సమయానికి లేకపోవడంతో వార్డెన్ కోటేశ్వరరావుపై డీఈవో మండిపడ్డారు. కనీసం హాస్టల్ ముందు మెట్లు పగిలిపోయి అధ్వానంగా ఉన్నాయి, బాగు చేసుకోకపోతే ఎలా అని, బాత్‌రూముల్లో నీరు లేక విద్యార్థులు బయటకు వెళ్తున్నారని, ఇంతగా దుర్వాసన వస్తున్నా.. అపరిశుభ్రంగా హాస్టల్‌ను నిర్వహిస్తున్నారని వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి భోజనం మెనూ కూడా పాటించకుండా రుచి, శుభ్రత కూడా పాటించకపోవడం సరికాదన్నారు. హాస్టల్‌లోని భోజనం ఒక్కసారైనా మీరు తిన్నారా అని మండిపడ్డారు. కలెక్టర్‌కు నివేదికను అందించి హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. డీఈవో వెంట మండల విద్యాధికారులు మోయినుద్దీన్, శోభారాణి, సీఆర్పీలు అనంతరామ్, హుశేనీ, యోహాన్, తదితరులున్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ రీ పోస్టింగ్‌ను రద్దు చేయాలి



వైఎస్సార్ సర్కిల్‌లో డీఈవో దిష్టి బొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ప్రిన్సిపాల్ రీ పోస్టింగ్ రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో డీఈవో దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శేఖర్ నాయుడు, మహేంద్ర, ఆఫ్రిది, నాగరాజు మాట్లాడుతూ పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో అవినీతికి పాల్పడిన ప్రిన్సిపాల్ కవితను మూడు నెలల క్రితం విచారణ చేసి విద్యార్థుల నిధులను దుర్వినియోగం చేశారని సస్పెండ్ చేశారన్నారు. మళ్లీ ఎస్ఓను అక్కడే రీ పోస్టింగ్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అప్పుడు అవినీతికి పాల్పడినట్లు విచారణలో ఇప్పుడు ఎందుకు విధుల్లోకి తీసుకున్నారని మండిపడ్డారు. ఎస్ఓ పోస్టింగ్‌ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేష్, రఘునాథ్, సుభాన్, రవితేజ, మోహన్ తదితరులు పాల్గొనారు.

రైతన్నలను ఆదుకోవాలి

● సీఎం చంద్రబాబును కోరిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



సీఎం చంద్రబాబుకు మంత్రాలయం సమస్యలు వివరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి, వలసలను నివారించాలని టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి కోరారు. శుక్రవారం అమరావతిలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, అభివృద్ధి పనులకు త్వరలో ప్రణాళికను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ యువ నాయకులు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలి



ఎంఈవోకు వినతి పత్రం ఇస్తున్న మోడల్ స్కూల్ విద్యా కమిటీ సభ్యులు

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ గౌస్, వైస్ చైర్మన్ విమల డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంఈవో నీలకంఠకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండుళ్లుగా ఆరు, ఏడు తరగతులకు ఇంగ్లిష్ బోధించే టీచర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామీణా ప్రాంతలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సకాలంలో రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. మధ్యాహ్న భోజన రుచికరంగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారన్నారు. అలాగే పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు పెరిగి ఉండటం వల్ల విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు తెలుపుతున్నారన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ సభ్యులు గానుగబాషా, ఈశ్వర్, గజేంద్రరెడ్డి, మల్లమ్మ, భారతి, శ్యామల సభ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి)22: కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సిరాలదొడ్డి గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గుంటిరంగను అరెస్టు చేసి 146 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజులపాటు మెజిస్ట్రేట్ ఆదేశించారని తెలిపారు. ఎవరైనా గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయించినా, అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు నిర్ణయంపై హర్షం

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం కోసం శాసనసభలో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షించదగ్గ విషయమని రాష్ట్ర కురువ, కురువ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని, ప్రజల చిరకాల కోరికను తీర్చారని, సీఎంకు రాయలసీమ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలుతో పాటు రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సీమ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన అన్నారు. సమావేశంలో కురవ సంఘం నాయకులు వెంకట్, ప్రకాష్ పాల్గొన్నారు.

నందవరం: కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రభుత్వానికి టీడీపీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కాశీంవలి, నందవరం మండల కన్వీనర్ డీవీ రాముడు మాట్లాడారు. అసెంబ్లీ సమావేశంలో ప్రత్యేక తీర్మాన చేయడంతో రాయలసీమ వాసులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బడేసాబ్‌వలి, వెంకట్రాముడు, పీరసాబ్ పాల్గొన్నారు.

ఆరోగ్యం బాగుంటే అంతా సౌభాగ్యమే: సీఐ



సీఐ రామాంజులుకు గుండె పరీక్ష చేస్తున్న వైద్యులు

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం బాగుంటే.. అంతా సౌభాగ్యమే కలుగుతుందని సీఐ రామాంజులు అన్నారు. శుక్రవారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మంత్రాలయం, మాధవరం ఎస్‌ఐలు పరమేష్ నాయక్, విజయకుమార్‌లతో కలిసి సీఐ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటేనే అన్ని పనులు చేసుకోగలుగుతామన్నారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం బీపీ, షుగర్, గుండె, కీళ్లు, కంటి వంటి పరీక్షలు వైద్యులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కర్నూలు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఇమ్రాన్, సిబ్బంది పాల్గొని వైద్య చికిత్సలు అందించారు. పోలీసులతో పాటు ప్రజలు కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రాఘవేంద్ర, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం



మూలరాములకు అభిషేకం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. శుక్రవారం సప్తమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. రథంపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శ్రీమఠం ప్రాంగాణం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, అన్నపూర్ణ భోజనశాల భక్తులతో కిటకిటలాడింది.

జలజీవన్ పనులతో తాగు నీరు

నందవరం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జలజీవన్ పనులతో ప్రతి ఒక్కరికి తాగునీటి అందుతుందని టీడీపీ నాయకులు తెలుగు ఈరన్న, మల్లికార్జున అన్నారు. శుక్రవారం నందవరంలో జరుగుతున్న జలజీవన్ పనులను పనుల వారు పరిశీలించారు. గత వైసీపీ హయాంలో గ్రామంలో తాగునీరు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి తాగు నీరు ఇచ్చేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారన్నారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి, ఎమ్మిగనూరు మార్కెట్ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంపయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నరసింహాలు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్,నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తూ జీవో విడుదల చేయాలని కర్నూలులో కలెక్టర్ కార్యాలయం ముందు చేయబోతున్న ధర్నాను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, రాష్ట్రంలో 260000 వలంటీర్లకు రూ10000 జీతం ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల వలంటీర్లతో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేపడుతామని హెచ్చరించారు.

రేపు వీరశైవ లింగాయతి వనభోజనం

ఎమ్మిగనూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఈ నెల 24న వీరశైవకల్యాణ మండపంలో బసవేశ్వర వీరశైవలింగాయతి సంక్షేమ సంఘం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు గౌడ్, మూర్తి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వనభోజన కార్యక్రమంలో భాగంగా ఉసిరి చెట్టుకు, బసవేశ్వర చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వనభోజన కార్యక్రమానికి వీరశైవ లింగాయతి కార్పొరేషన్ మాజీ అధ్యక్షులు వై రుద్రగౌడ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, నాగరాజు గౌడ్‌లు హాజరవుతున్నాట్లు తెలిపారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని వీరశైవులు వనభోజన కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మఠం దక్షిణ ముఖ ద్వారం నిర్మాణానికి విరాళం

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం దక్షిణ ముఖద్వారం నిర్మాణానికి బెంగుళూరు చెందిన శ్రీనాథ్ అనే భక్తుడు రూ. ఆరు లక్షలు విలువ చేసే గ్రానైట్‌ను విరాళంగా ఇచ్చాడు. దాదాపు రూ.21 లక్షలతో అన్నపూర్ణ భోజన శాల, పరిమళ ప్రసాదం వద్ద దక్షిణ ముఖద్వారాన్ని సుందరంగా నిర్మిస్తున్నారు. అలాగే శ్రీమఠం ప్రాంగణం వరకు పూర్వ పీఠాధిపతుల బృందావనం ముందు భాగంలో గ్రానైట్‌ను అమర్చారు. ముఖద్వారం పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి.

యోగా ద్వారా మానసిక ప్రశాంతత



మాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

మంత్రాలయం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే యోగా, మార్స్ డ్రిల్ వ్యాయామం చేయడం వల్ల శారీరక సమస్యలు తొలగి, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని పాఠశాల హెచ్ఎం భోజరాజు అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణంలో యోగాపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యతో పాటు వ్యాయామం, యోగా వంటి ప్రాముఖ్యతను వివరించారు. ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ విద్యార్థులకు పలు విన్యాసాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే లాభాలను విద్యార్థులు గమనించి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యుగంధర్, నీలకంఠ స్వామి, జగదీష్, నాగరాజు, వెంకటరమణ నాయక్, ఈరమ్మ, తార, శశి, తదితరులు పాల్గొన్నారు.

మట్టితో మురుగు గుంత పూడ్చివేత



చిర్తన్‌కల్‌లో మురుగునీటి వద్ద మట్టి వేస్తున్న సర్పంచ్ ఈరన్న

కోసిగి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిర్తనకల్ గ్రామంలో ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇళ్ల మధ్య మురుగునీరు.. చెంతనే రోగాలు అన్న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, సర్పంచ్ ఈరన్న శుక్రవారం ఆ మురుగు గుంతను మట్టితో పూడ్చేశారు. కొన్ని నెలల నుంచి ఆ మురుగు గుంతతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ గుంతను పూడ్చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దనేలటూరులో డెంగీ కేసు నమోదు



పెద్దనేలటూరు ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

గోనెగండ్ల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో డెంగీ కేసు నమోదు అయిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో ఆయన, వైద్యశాఖ సిబ్బంది, ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్‌డీ అనంతశయన పర్యటించారు. గ్రామంలో నాలుగేళ్ల చిన్నారికి డెంగీ సోకడంతో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులకు జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులు ఉన్నవారికి మందులను అందజేశారు. 40 రోజులలో మండలంలో ఏడు కేసులు నమోదు అయినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇళ్ల పరిసరాలలో దోమలు ప్రబలకుండా పెరిత్రియం ద్రావణం పిచికారి చేయించాలని వైద్యసిబ్బందికి సూచించారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అనుపత్రికి రావాలని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, శాంతమ్మ సిబ్బంది పాల్గొన్నారు.